ఎల్ ఆర్ఎస్ ఫీజులైతే కట్టండి

- దరఖాస్తుదారులకు ఫీజు ఇంటిమేషన్
- హెచ్ఎండీఏ పరిధిలో 2.85లక్షల దరఖాస్తులు
- సాంకేతిక సమస్యలతో ఆలస్యమవుతున్న ఫీజు ఇంటిమేషన్ లింక్

సిటీబ్యూరో, మార్చి 15 (నమస్తే తెలంగాణ) ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం దరఖాస్తుదారులకు ఫీజులు చెల్లించాలని ఆదేశాలు వస్తున్నాయి. ఇన్నాళ్లు దరఖాస్తుల పరిశీలన పూర్తి అయిన వారు మాత్రమే ఫీజులు చెల్లించాల్సి ఉండేది. కాని దరఖాస్తుల పరిశీలన పూర్తి కాకుండానే ఫీజులైతే కట్టాలంటూ నోటిఫికేషన్లను ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు చేరవేస్తోంది. హెచ్ఎండీఏ పరిధిలో మొత్తం 3.50 లక్షలకు పైగా దరఖాస్తులు ఉండగా.. ఇందులో 2.85లక్షల దరఖాస్తులకు ఫీజు ఇంటిమేషన్ సమాచారాన్ని చేరవేసినట్లుగా తెలిసింది. అయితే అధికారులు మాత్రం ఈ విషయాన్ని గోప్యంగా ఉంచుతున్నారు. దీంతో తమ దరఖాస్తుల పరిశీలన పూర్తి కాకుండానే ఫీజుల పేమెంట్ లింక్ యాక్టివేట్ కావడంతో... దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. ఉన్న ఫళంగా ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి వస్తుందని జనాలు వాపోతున్నారు. భూముల క్రమబద్ధీకరణలో ప్రభుత్వ దూకుడు వ్యవహారంతో జనాలు ఇబ్బందులు పడుతున్నారు. క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి కాకుండానే ఫీజులు చెల్లించాలని ఆదేశాలిస్తున్నారు. హెచ్ఎండీఏ పరిధిలో మొత్తం 3.50 లక్షలకుపైగా జీపీ లే అవుట్లు, అనధికారిక వెంచర్లలో ప్లాట్లు ఉన్నాయి. వీటిలో అనధికారిక లే అవుట్లు కూడా ఉండగా... వీటిన్నింటికి ఎలాంటి పరిశీలన జరగకుండా ఫీజులు అయితే చెల్లించాలనే ఆదేశాలిస్తున్నారు. ఇటీవల విడుదలైన ఎల్ఆర్ఎస్ నిబంధనల ప్రకారం.. దరఖాస్తుదారులు ముందుగానే ఫీజులు చెల్లిస్తే, ఆ తర్వాత రెగ్యులరైజ్ అవకాశాలను బట్టి ప్రొసిడింగ్స్ జారీ చేస్తామని స్పష్టం చేస్తున్నాయి. ఒకవేళ ప్రొసిడింగ్స్ ఇవ్వలేని సమస్యలు ఉంటే గనుక చెల్లించిన ఫీజులో 10 శాతం కోత విధించి, 90శాతం తిరిగి చెల్లిస్తామని పేర్కొంది. కొత్త మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ లెక్కన ఎల్ఆర్ఎస్ దరఖాస్తు చేసుకున్న వారందరికీ కూడా ఫీజు ఇంటిమేషన్ జారీ అవుతున్నట్లుగా తెలిసింది.

ఏకదంత ఆధ్వర్యంలో సంస్కృతం కోర్సు

సిటీబ్యూరో, మార్చి 15, (నమస్తే తెలంగాణ): భారతీయ ప్రాచీన విద్యా సంస్థ(ఏకదంత) ఆధ్వర్యంలో సంస్కృత ఫండమెంటల్ కోర్సు శనివారం ప్రారంభించారు. శ్రీ తత్త్వ విదానంద సరస్వతి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. సంస్కృతాన్ని అభ్యసించ దలచిన వారు www.ekadantha.in వెబ్‌సైట్ ద్వారా ఉచితంగా రిజిస్టర్ చేసుకోవాలని నిర్వాహకులు తెలియజేశారు.

చదువులో వెనుకబడిన విద్యార్థులకు ఏఐ పాఠాలు

సిటీబ్యూరో, మార్చి 15, (నమస్తే తెలంగాణ): చదువులో వెనుకబడిన 3,4,5 తరగతుల విద్యార్థులను సీ గ్రేడ్ నుంచి బీ, ఏ గ్రేడ్‌కు తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం విన్నూత కార్యక్రమం చేపట్టింది. అందులో భాగంగా చదువులో వెనకబడిన విద్యార్థులకు కృత్రిమ మేధా సహాయంతో పాఠాలు చెప్పేందుకు ఇప్పటికే ప్రణాళిలు చేసింది. ఇందుకుగాను ఎక్స్ స్టెప్ ఫౌండేషన్ సహకారంతో కంప్యూటర్లను వినియోగించి పాఠాలు చెప్పేందుకు విద్యాశాఖ కృషి చేస్తుంది. శనివారం నాంపల్లిలో ఉన్న 9 పాఠశాలల్లో జిల్లా విద్యాధికారులు ఏఐ పాఠాలు నిర్వహించేందుకు గదులను ప్రారంభించారు.

సిటీ యూనియన్ బ్యాంక్ సేవలు మరింత బలోపేతం

సిటీబ్యూరో, మార్చి15,(నమస్తే తెలంగాణ): భారతదేశంలోని ప్రముఖ ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో ఒకటైన సిటీ యూనియన్ బ్యాంక్, ఇండియన్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ జట్టు సన్‌రైజర్స్ హైదరాబాద్ తో శనివారం ప్రత్యేక బ్యాంకింగ్ భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ సందర్భంగా సిటీ యూనియన్ బ్యాంక్ ఎండీ డాక్టర్ కమకొడి మాట్లాడుతూ ఈ భాగస్వామ్యం క్రికెట్ ప్రేమికులకు బ్యాంకింగ్ సేవలను మరింత చేరువ చేయడంతో పాటు విభిన్నమైన ఆర్థిక సేవలను అందించనుందని తెలిపారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి : సీపీఎం

రోడ్డును పరిశీలించి నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

భూదాన్ పోచంపల్లి, మార్చి 15 : మున్సిపాలిటీ పరిధిలోని రేవణపల్లి గ్రామ శివారులో మూలమలుపు వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల, పట్టణ కార్యదర్శులు కోట రామచంద్రారెడ్డి, దుబ్బాక జగన్ కోరారు. ఆ రోడ్డును శనివారం పరిశీలించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రం నుంచి పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారడం, ఇరువైపులా మూసీ కాల్వలు ఉండడం వల్ల వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. మూల మలుపుల వద్ద చెట్లను తొలగించి రోడ్డు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మంచాల మధు, నోముల కృష్ణారెడ్డి, బుగ్గ లక్ష్మయ్య, యాదగిరి, కృష్ణ, అనసూయ, అలీ, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

రాజాపేటను కరువు మండలంగా ప్రకటించాలి : సీపీఐ

రాజాపేట : సింగారంలో ఎండిపోయిన వరి పంటను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

రాజాపేట, మార్చి 15 : రాజాపేటను కరువు మండలంగా ప్రకటించాలని సీపీఐ మండల కార్యదర్శి చిగుళ్ల లింగం డిమాండ్ చేశారు. మండలంలోని సింగారం గ్రామంలో ఎండిపోయిన వరి పొలాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండిన పంటల వివరాలను వెంటనే సేకరించి రైతులకు ఎకరాకు రూ.25వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కిలోమీటర్ కాల్వ తవ్వితే సింగారం గ్రామ చెరువు నిండి మండలంలోని అన్ని చెరువులు నింపేందుకు ఆస్కారం ఉన్నా పాలకులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడంతోనే రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులను ఆదుకోవాలని కోరారు. పెట్టుబడులు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించకుంటే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడుతామన్నారు.

బీమా చెక్కు అందజేత

బీమా చెక్కును అందజేస్తున్న టీజీబీ మేనేజర్ రామకృష్ణ

ఆలేరు టౌన్, మార్చి 15 : మండలంలోని మంతపురి గ్రామానికి చెందిన దంతూరి పరశురాం ఇటీవల ఆకస్మికంగా మృతిచెందాడు. ఆయనకు తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి ఇన్సూరెన్స్ పాలసీ ఉండగా.. బీమా సొమ్ము రూ.2లక్షలు మంజూరయ్యాయి. నామినీ అయిన పరశురాం భార్య శ్రీలతకు ఆలేరులో బ్యాంకు మేనేజర్ సీహెచ్ రామకృష్ణ శనివారం బీమా చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ తమ బ్యాంకులో అకౌంట్ కలిగిన ప్రతిఒక్కరూ రూ.436తో ఇన్సూరెన్స్ తీసుకుంటే ప్రమాదవశాత్తు వ్యక్తి మరణిస్తే నామినీకి రూ.2లక్షల బీమా అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ బి.శ్రీనివాస్, బ్యాంక్ మిత్ర రాజేశ్వరి, ఖాతాదారులు పాల్గొన్నారు.

అసంపూర్తి నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలి : సీపీఎం

ఆరెగూడెంలో డంపింగ్ యార్డు వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మోటకొండూర్, మార్చి 15 : బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన శ్మశానవాటిక, డంపింగ్ యార్డు పనులను వెంటనే పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొలగాని జయరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం పోరుబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆరెగూడెంలో అసంపూర్తిగా ఉన్న శ్మశానవాటిక, డంపింగ్‌యార్డును శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేక అనేక సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కొల్లూరి ఆంజనేయులు, గ్రామ శాఖ కార్యదర్శి కొల్లూరి రమేశ్, నాయకులు సుధాకర్, వరప్రసాద్, నగేశ్, శ్రీహరి, నాగరాజు, ప్రవీణ్, నాగరాజు, మైసయ్య పాల్గొన్నారు.

అభ్యుదయ రచయిత పెనుగొండ

రచయిత పెనుగొండ లక్ష్మీ నారాయణను సన్మానిస్తున్న వక్తలు

రవీంద్రభారతి, మార్చి15: అభ్యుదయ రచయిత పెనుగొండ లక్ష్మీనారాయణ అని ప్రముఖ అభ్యుదయ రచయిత, తెలుగు యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి ఎస్వీ సత్యనారాయణ అన్నారు. శనివారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ప్రముఖ అభ్యుదయ కవి , రచయిత పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చిన సందర్భంగా తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం ఏర్పాటు చేసిన పెనుగొండ సన్మాన సభకు ఎస్వీ సత్యనారాయన అధ్యక్షత వహించారు. ఈ సభలో పెనుగొండ లక్ష్మీనారాయణను శాలువా, మెమొంటో గజమాలతో అరసం నేతలు ఘనంగా సత్కరించారు. సత్యనారాయణ మాట్లాడుతూ పెనుగొండ లక్ష్మీనారాయణ అనే క దశాబ్దాలుగా అభ్యుదయ సాహిత్యోద్యమానికి కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చాడా వెంకట్‌రెడ్డి, సుద్దాల అశోక్ తేజ, మాజీ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, మామిడి హరికృష్ణ, సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.ఎన్.బాలచారి, రియాజ్,వేల్పుల నారాయణ, ఆర్వీ రామారావు తదితరులు పాల్గొన్నారు. హిందీ భాషను బలవంతంగా రుద్దడంపై సభలో చర్చకు వచ్చింది. మీడియా అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ.. దక్షిణాది రాష్ట్రాలపై హిందీ భాషా పెత్తనాన్ని అరసం నిరసించాలని స్థానిక భాషలను, స్థానిక సంస్కృతులను పరిరక్షించేందుకు అభ్యుదయ సంస్థలే ఉద్యమించాలని ఆకాంక్షించారు.

వృద్ధులంటే చిన్నచూపా..?

గాంధీలో ప్రారంభానికి నోచుకోలేని జెరియాట్రిక్ విభాగం

దుమ్ముతో దర్శనమిస్తున్న గాంధీలోని జెరియాట్రిక్ విభాగం

సిటీబ్యూరో, మార్చి15,(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వమే తప్పా చేతల ప్రభుత్వం కాదన్న విషయం తెలంగాణ ప్రజలకు ఏడాది తిరిగే లోపే తెలిసిపోయింది. ఎంతసేపు ప్రతిపక్షాలను దుమ్మెత్తి పోయడమే పనిగా పెట్టుకున్న రేవంత్ సర్కారు అభివృద్ధి పనుల్లో మాత్రం వెనుకడుగు వేస్తుంది. మరీ ముఖ్యంగా కేసీఆర్ హయాంలో వెలసిల్లిన వైద్యరంగ అభివృద్ధిని కొనసాగించకుండా ప్రాణం తీసే పనిపెట్టుకుంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటినుంచి నేటి వరకు వైద్యరంగం కూదేలైపోయింది. గాంధీ ఆసుపత్రిలో గతేడాదిలో జెరియాట్రిక్ విభాగం ఏర్పాటుకు శ్రీకారం చుట్టగా అది నేటికీ కలగానే మిగిలింది. ప్రస్తుతం ప్రారంభానికి నోచుకోక దుమ్ముతో దర్శనమిస్తుంది.

లక్ష్యం చేరేదెన్నడూ..?

అత్యధిక రోగులు గాంధీకి చికిత్సకోసం వస్తున్న తరుణంలో వృద్ధులు చికిత్స చేయించుకునేందుకు నానావస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంటుంది. వైద్యం కోసం గాంధీ మెట్లెక్కే వృద్ధులకు నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో పదకొండునెలల క్రితం జెరియాట్రిక్ వార్డుకు శ్రీకారం చుట్టారు. గతంలో చిన్నపిల్లల వార్డులుగా సేవందించిన రెండు వార్డులను వృద్ధులకోసం జెరియాట్రిక్ వార్డుగా మార్చారు. అందులో భాగంగానే 40 పడకల సామర్థ్యంతో ఆ వార్డు రూపురేఖలను మార్చేశారు. ఇటీవల గాంధీలో పర్యటించిన వైద్యారోగ్యశాఖ మంత్రి సైతం జెరియాట్రిక్ వార్డు పురోగతి పై అడగకపోవడం గమనార్హం.

యాసిడ్ దాడి కేసులో ఇద్దరు అరెస్ట్

సైదాబాద్, మార్చి 15 : సైదాబాద్ భూలక్ష్మీ మాత ఆలయ అకౌంటెంట్ నర్సింగ్ రావు పై యాసిడ్ దాడి చేసిన సంఘటనలో ప్రమేయం ఉన్న ఇద్దరిని సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అదే ఆలయంలో పూజారిగా పనిచేస్తున్న మరో అర్చకుడితో అకౌంటెంట్ పై యాసిడ్ తో దాడికి పాల్పడ్డాడు. ఇద్దరిని పోలీసులు శనివారం అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. అకౌంటెంట్ నర్సింగ్ రావుకు ఆలయ ప్రస్తుత అర్చకులు మధ్య గత కొంత కాలంగా ఉన్న విభేదాలు, ఘర్షణల కారణంగానే దాడి జరిగినట్లు తెలిపారు. దాడికి పాల్పడ్డ ఇద్దరిని పోలీసులు ఆదివారం సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ కార్యాలయంలో హాజరు పర్చనున్నట్లు పోలీసులు తెలిపారు.

గ్రూప్స్‌లో మెరిసిన గౌస్‌నగర్ వాసి

అజయ్‌కుమార్‌రెడ్డి

భువనగిరి కలెక్టరేట్, మార్చి 15 : ఇటీవల విడుదలైన గ్రూప్-2, గ్రూప్-3 ఫలితాల్లో మండలంలోని గౌస్‌నగర్ యువకుడు ఎలిమినేటి అజయ్‌కుమార్‌రెడ్డి సత్తా చాటాడు. గ్రూప్-2లో 713వ ర్యాంక్, గ్రూప్-3లో 451వ ర్యాంక్ సాధించాడు. అజయ్‌రెడ్డి గ్రూప్-4లో 336వ ర్యాంక్ సాధించి ప్రస్తుతం కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. అజయ్‌కుమార్ రెడ్డికి తల్లిదండ్రులు, స్థానికులు అభినందనలు తెలిపారు.

'భగవద్గీతను పఠించాలి'

వలిగొండ, మార్చి 15 : సర్వ మానవాళి సమన్వయ జ్ఞానాన్ని భగవద్గీత అందిస్తుందని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా కమిటీ ఇందు జ్ఞాన వేదిక కమిటీ సభ్యుడు దేవేంద్ర శంకర్ అన్నారు. మండలంలోని గొల్నెపల్లి గ్రామంలో శనివారం త్రైత సిద్ధాంత ఆదికర్త ప్రబోదానంద యోగీశ్వర స్వామి రచించిన 101 ఆధ్యాత్మిక రచనలతో పాటు నూతన తెలుగు కాలమానిని అందించి యుగాదిపై అవగాహన కల్పించారు. భగద్గీతను చదివి ఔన్నత్యాన్ని తెలుసుకోవాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ కమిటీ, ఇందు జ్ఞానవేదిక భువనగిరి, తొర్రూరు, చేర్యాల కమిటీల సభ్యులు లింగస్వామి, రాము, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, సాయి రాజు, అశోక్, బుచ్చిబాబు, లలిత, ధనలక్ష్మి, మంజుల పాల్గొన్నారు.

షుగర్ ఫ్రీ ఐస్‌క్రీములకు భలే క్రేజ్..!

తాజా పండ్లు ఆరగించిన అనుభూతి
మార్కెట్లో వేలల్లో ఫ్లేవర్స్, విభిన్న రకాల వెరైటీలు
వేడుక ఏదైనా ఐస్‌క్రీమ్ ఉండాల్సిందే
వేసవిలో ఐస్‌క్రీం పార్లర్స్‌కు పెరిగిన డిమాండ్

సిటీబ్యూరో, మార్చి 15 (నమస్తే తెలంగాణ): చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు ఐస్‌క్రీమ్‌ను చూస్తే చాలు లొట్టలేసుకుంటారు. సీజన్ ఏదైనా హిమక్రీములను రుచి చూడటంలో వెనుకాడరు. వేడుక ఏదైనా ఐస్‌క్రీమ్‌లకే జై కొడుతారు. స్ట్రాబెరీ, వెనిల, మ్యాంగో, రెడ్‌వెల్వెట్, చాకో ఆల్మండ్, ఫ్రూట్ బనానా తదితర ఐస్‌క్రీమ్స్.. అందరి నోళ్లల్లో నీళ్లూరిస్తుంటాయి. పార్లర్‌లో అడుగుపెట్టడమే ఆలస్యం విభిన్న రకాల ఫ్లేవర్స్ ఎంతగానో ఆకర్షిస్తాయి. ముఖ్యంగా షుగర్ ఫ్రీ ఐస్‌క్రీములకు భలే డిమాండ్ పెరిగిందని నిర్వాహకులు చెబుతున్నారు.

తాజా పండ్లు తిన్నామనే భావన:

కొన్ని ఐస్‌క్రీమ్ పార్లర్లు.. నేచురల్ ఐస్‌క్రీములకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. తాజా పండ్లు తిన్నామనే భావన కలిగేలా ఐస్‌క్రీమ్స్‌ను ఎంతో రుచిగాతయారుచేస్తున్నారు. కొకొనట్, వాటర్ మిలన్, మ్యాంగో, అంజీర్, కాజుకిస్మిస్, చీకో, రోస్టెడ్ ఆల్మండ్, పాపయా,పైనాపిల్, మస్క్‌మెలన్, కేసర్‌పిస్తా, మలాయి తదితర ఐస్‌క్రీములకు భలే గిరాకీ ఉంటుందని పార్లర్ నిర్వాహకులు చెబుతున్నారు. పాలు, ప్రోటీన్లు, సాలిడ్స్‌లను కొంత పర్సెంటీలతో మిక్స్ చేసి ఐస్‌క్రీములను తయారు చేస్తారని ఒక పార్లర్ మేనేజర్ రవి కాంత్ తెలిపారు.

వెరైటీలతో ఆకర్షణ:

పిల్లల కోసం క్యాండిలాండ్, మేజిక్‌పాప్, బబుల్‌గమ్ ఐస్‌క్రీములు, అమ్మాయిల కోసం చాక్లెట్ ఫ్లేవర్స్‌తో వారిని ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. అంతేకాదు డయాబెటిక్ పేషెంట్లు ఐస్‌క్రీమ్‌లు లాగించేలా షుగర్ ఫ్రీ ఐస్‌క్రీములను అందిస్తున్నారు. వెనిలీ, స్రాబెరీ, కేసర్‌పిస్తా, చాక్లెట్, కెర్మెల్ కుల్ఫీలను షుగర్ పేషెంట్లు రుచిచూస్తూ ఆనందంలో తేలుతున్నారు. ఇక అమ్మాయిలు ఎక్కువగా చాక్లెట్ ఐస్‌క్రీములను ఇష్టపడుతున్నారని నిర్వాహకులు చెప్పారు. చాకో క్రీమ్, చాకో ఆల్మండ్, చాకోబైట్ తదితర ఐస్‌క్రీములను అమ్మాయిలు ఇష్టంగా తింటున్నారని తెలిపారు.

నోరూరిస్తున్న సీజనల్ ఐస్‌క్రీములు:

సీతాఫల్, మ్యాంగో, పీచ్ ఆప్రికట్, బ్లాక్ గ్రేప్స్, లిచీ, జాక్ ఫ్రూట్, గావా, కలాజమున్ తదితర సీజనల్ ఐస్‌క్రీములు కస్టమర్లను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. ఒక్క ఐస్‌క్రీం తినాలని పార్లర్‌కు వచ్చిన వారు.. అక్కడ కనిపించే వెరైటీలు చూసి అదనంగా ఐస్‌క్రీములను లాగిస్తున్నారు. దీంతో బిల్లుకనీసం రూ.500లు దాటుతోంది. బర్త్‌డే, ఫ్రెండ్స్ ట్రీట్ పేర్లు ఏదైతేనేం... ఐస్‌క్రీములు ఆరగించడమే ప్రధానంగా కనిపిస్తోంది. అంతేకాదు మనకు నచ్చిన ఐస్‌క్రీంలో విభిన్న రకాల ఫ్లేవర్స్ కలుపుకొని... డ్రైఫ్రూట్స్ వేసుకుని ఆరగించే వీలు కూడా పార్లర్స్ కల్పించాయి.

కాన్షిరామ్ చిత్రపటానికి నివాళి

కాన్షిరామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న బీఎస్పీ నాయకులు

భువనగిరి అర్బన్, మార్చి 15 : బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షిరామ్ 91వ జయంతిని పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఎస్పీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బాసాని మహేందర్ మాట్లాడుతూ బహుజన సమాజానికి సామాజిక, రాజకీయ హక్కులను ఇచ్చిన గొప్ప నాయకుడు కాన్షిరామ్ అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు వేముల బాలస్వామి, బట్టు రాంచంద్రయ్య, కోరబోయిన పాండు, గుండు కృష్ణ, రాంపల్లి నర్సింగ్‌రావు, బర్రె నగేశ్, గడ్డం స్వామి పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ


బీబీనగర్ : విద్యార్థులకు పరీక్ష కిట్లు అందజేస్తున్న ప్రదీప్‌గౌడ్

బీబీనగర్, మార్చి 15 : మండలంలోని పడమటిసోమారం గ్రామంలో పదో తరగతి విద్యార్థులకు దాసన్న ఫౌండేషన్ చైర్మన్ తంతరపల్లి ప్రదీప్‌గౌడ్ ఆధ్వర్యంలో శనివారం పరీక్ష కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని పరీక్షలు రాయాలన్నారు. గ్రామంలో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థికి రూ.5వేలు, మంచి ఉత్తీర్ణత శాతం పొందిన వారికి రూ.2500 ఫౌండేషన్ తరపున అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఆల్వ భాస్కర్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఆలేరు రూరల్ : మండలంలోని కొలనుపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి ఆన్‌రెడ్డి రఘుపతిరెడ్డి జన్మదినం సందర్భంగా పరీక్ష సామాగ్రి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఆరుట్ల లక్ష్మీప్రసాద్‌రెడ్డి, గంగుల శ్రీనివాస్, నాయకులు స్వామి, భానుచందర్, కాలేందర్ గౌడ్, కొండల్, రాజు, భాస్కర్ పాల్గొన్నారు.

కొంగరి భాస్కర్ జయంతి

భూదాన్ పోచంపల్లి, మార్చి 15 : మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్ గ్రామంలో చేనేత జన సమాఖ్య తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో మాజీ జడ్పీటీసీ, రాష్ట్ర చేనేత నాయకులు స్వర్గీయ కొంగరి భాస్కర్ 66వ జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ, చేనేత పరిశ్రమ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో చేనేత జన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చింతకింది రమేశ్, మాజీ సర్పంచ్ కొంగరి కృష్ణ, చేనేత జన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కర్నాటి పురుషోత్తం, కార్యదర్శి ఆటిపాముల మహేందర్, ప్రతినిధులు ఈపూరి విష్ణు, బింగి భాస్కర్, రామకృష్ణ పాల్గొన్నారు.

పాత నాణేలు పేరుతో రూ. లక్షా 30 వేలు బురిడీ

పీర్జాదిగూడ మార్చి 15 ఇంట్లో ఉన్న పాత నాణేలను పంపిస్తే అధిక డబ్బులు ఇస్తామని రూ.1 లక్షా 30 వేలు బురిడీ కొట్టించిన సైబర్ నేరగాళ్లు. సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. నారపల్లిలో నివాసముంటున్న ఇన్‌స్టాగ్రామ్ బ్రౌజ్‌చేస్తున్నప్పుడు పాత నాణేలను పంపిస్తే పెద్ద మొత్తంలో డబ్బులు ఇస్తామని తెలిపే ప్రకటన కనిపించింది. ప్రకటన చూసిన ఆమె తన దగ్గర ఉన్న నాణేల ఫొటోలు ఇన్‌స్టాగ్రామ్ లో షేర్ చేసింది. దీనికి ఫలితంగా రూ. 46 లక్షలు అందుతాయని బాధితురాలిని నమ్మించారు దీనికి ఆధార్ కార్డు ఫొటోను వారికి పంపించింది. ఈ రూపాయలు పంపించడానికి ప్రాసెసింగ్ చార్జీలు రూ.750 చెల్లించాలని తెలపడంతో డబ్బులను పంపించింది. చాటింగ్‌ద్వారా డబ్బులు వస్తున్నాయని నమ్మిస్తూ డబ్బులు తీసుకొస్తుండగా తన వ్యక్తిని ఎయిర్ పోర్టులో అధికారులు పట్టుకున్నారని, పట్టుబడిన వ్యక్తిని రిలీజ్ చేయడానికి ఇతరుల పేర్లతో నమ్మించి కొంత కొంత డబ్బులను పంపియమని రూ.లక్ష 30 వేలు బురిడీ కొట్టించారు. ఎంతకు డబ్బులు పంపించకపోవడంతో మోసపోయానని తెలుసుకున్న బాధితురాలు మేడిపల్లి పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

డిజిటల్ అరెస్ట్ మోసంలో ప్రధాన నిందితుడు అరెస్ట్

సిటీబ్యూరో, మార్చి15, (నమస్తే తెలంగాణ): డిజిటల్ అరెస్ట్ మోసానికి పాల్పడిన ప్రధాన నిందితుడిని హైదరాబాద్ నగర సైబర్ క్రైమ్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌కు చెందిన మొహమ్మద్ జుబెర్ అహ్మద్ (31)ప్రస్తుతం దుబాయ్‌లో నివాసముంటున్నాడు. దుబాయ్ నుంచే బ్యాంకు ఖాతాలను నిర్వహించి బాధితులను మోసం చేస్తుండగా పోలీసులు అతనిపై ఎల్ఓసీ జారీ చేశారు. గత జూలై 24న హైదరాబాద్ లోని ఓ వ్యక్తికి కాల్ వచ్చింది. ముంబాయిలోని అంధేరీ ఈస్ట్ బ్రాంచ్‌కు చెందిన ఫెడెక్స్ కార్యనిర్వాహకుడుగా నిందితుడు తనను తాను పరిచయం చేసుకున్నాడు. ఆ వ్యక్తి ఐడీతో ఇరాన్‌కు పార్శిల్ పంపించారని నమ్మించాడు. అందులో 7 పాస్‌పోర్టులు, 4 క్రెడిట్ కార్డులు, 2 ల్యాప్‌టాప్‌లు, ఒక జత షూస్, 6 కిలోల బట్టలు, 130 షీట్లు ఎల్ఎస్‌డీ డ్రగ్స్ ఉన్నాయని, వాటిని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారని భయపెట్టాడు. పోలీసులు క్లీన్ చీట్ ఇవ్వాలంటే రూ. 55 లక్షలు బ్యాంకు ఖాతాలో జమ చేయాలని బాధితున్ని భయబ్రాంతులకు గురిచేశాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు ఆ ఖాతాకు డబ్బులు పంపించాడు. బాధితుని ఫిర్యాదు మేరకు సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో ఇన్‌స్పెక్టర్ ఎస్. మట్టం రాజు, ఎస్సై శైలేంద్ర కుమార్, ఎస్సైహిమ రెడ్డి, ఏఎస్సై రాజ్‌కుమార్పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ మరింత జాప్యం

మారనున్న నూతన మాస్టర్ ప్లాన్ రూపురేఖలు

సిటీబ్యూరో, మార్చి 15(నమస్తేతెలంగాణ) : హెచ్ఎండీఏ పరిధి మూడు వేల చదరపు కి.మీ. పెరిగిన నేపథ్యంలో మాస్టర్ ప్లాన్ 2050 మరింత జాప్యం కానుంది. ఈ ప్రక్రియను చేపట్టేందుకు ఇప్పటి కేహెచ్ఎండీఏ ఓ కన్సల్టెన్సీకి మాస్టర్ ప్లాన్ రూపకల్పన బాధ్యతలు అప్పగించింది. ఈక్రమంలో పెరిగిన పరిధికి అనుగుణంగా మాస్టర్ ప్లాన్ మార్పులు చేయాల్సి ఉండగా... కొత్తగా అందుబాటులోకి వచ్చిన పరిధిలోని రిక్రియేషన్, గ్రీన్ స్పేస్, రెసిడెన్షియల్, కమర్షియల్, ఇండస్ట్రీయల్, పెరి అర్బన్ జోన్లతో మౌలిక వసతులతో అనుగుణంగా జోడించాల్సి ఉంటుంది. దీనికి అనుగుణంగానే మాస్టర్ ప్లాన్ ఆధునీకరణపై కసరత్తు చేస్తుంది. ఈ క్రమంలో హెచ్ఎండీఏ ఉన్నతాధికారులు ఇప్పటికే అందుబాటులో ఉన్న మాస్టర్ ప్లాన్ 2031ని మరింత ఆధునీకరించడంతోపాటు కొత్తగా చేరిన 4 జిల్లాలలోని ఆయా మండలాలు, గ్రామాల పరిధిలో చేరిన ప్రాంతాలకు అనుగుణంగా మార్పులు చేర్పులు చేయనున్నారు.

మాస్టర్ ప్లాన్ల విలీనం

ప్రస్తుతంఎంసీహెచ్, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, సైబరాబాద్, హైదరాబాద్ఎయిర్ పోర్ట్ మాస్టర్‌ప్లాన్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటిని మాస్టర్ ప్లాన్ 2031లో విలీనం చేయాల్సింది. కానీ సాంకేతికంగా ఎదురైన ఇబ్బందులతో విలీన ప్రక్రియజరగలేదు. ఈ క్రమంలో మాస్టర్ ప్లాన్ 2050కి అనుగుణంలో ఈ ఐదు మాస్టర్ ప్లాన్లనుకలిపి ఒకే బృహత్తర మాస్టర్ ప్లాన్ చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న 3500 చెరువులను మాత్రమే హెచ్ఎండీఏ పర్యవేక్షించే అవకాశం ఉన్నట్లుగా సమాచారం.

కొత్త మాస్టర్ ప్లాన్ మరింత జాప్యం

మాస్టర్ ప్లాన్ 2031 ప్రకారం ఉన్నట్లుగానే రోడ్లు, మౌలిక వసతులు, జోన్ల విస్తరణ జరిగింది. అయితే కొత్తగా రాబోయే మాస్టర్ ప్లాన్ ప్రకారం రియల్ ఎస్టేట్ రంగంలో మరిన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా మౌలిక వసతులు, గ్రీన్ స్పేస్, వాటర్బాడీస్ పరిరక్షణకు అనుగుణంగా మార్పులు చేయనున్నారు. కొత్తగా పెరిగిన విస్తీర్ణానికి అనుగుణంగా మాస్టర్ ప్లాన్ ఇంటిగ్రేషన్ చేయడానికి మరో ఏడాది సమయం పడుతుందని హెచ్ఎండీఏ వర్గాలు చెబుతున్నాయి.